షాబాద్‌లో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హామీలను వెంటనే అమలు చేయాలి

బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి మాణెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బర్క శ్రీశైలం

షాబాద్, జూలై 22 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి మాణెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బర్క శ్రీశైలం అన్నారు. సోమవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే కులగణన చేసి బీసీ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 40 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా గొల్ల కుర్మలకు వంద రోజుల్లో రెండో విడత సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేస్తామని, రూ.2లక్షలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కుర్మలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎంబీసీలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. ముదిరాజ్, గంగపుత్ర, గౌడ, మున్నూరు కాపు, పద్మశాలీ, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సురేశ్, ఓబీసీ మండల ప్రధాన కార్యదర్శి రాకేశ్, బీజేవైఎం జిల్లా అధికారి ప్రతినిధి మహేందర్, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం

యాచారం : కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. ఈమేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. అనంతరం ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులున్నారు.

సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యం

- చౌరస్తా విస్తరణ అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్యే శంకర్
- చౌరస్తాలో 100 ఫీట్ల సర్కిల్‌తో రోడ్డు అభివృద్ధి
- పట్టణ అభివృద్ధికి అందరి సహకారం ఉండాలని పిలుపు

షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జూలై 22 : వ్యాపారస్తులు, పట్టణవాసులు సహకరిస్తే షాద్‌నగర్ చౌరస్తాను మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, స్థానిక వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కోరారు. సోమవారం షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రోడ్డు విస్తరణ, చౌరస్తా అభివృద్ధిపై నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించి తగిన సూచనలు చేశారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను చేసేందుకు సిద్ధంగా ఉందని, నిధులు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

చౌరస్తాలో కచ్చితంగా 100 ఫీట్ల సర్కిల్ వెడల్పుతో రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉందని, భవిష్యత్ తరాలకు సరిపడా మౌలిక వసతులను కల్పిస్తేనే పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. అఖిలపక్ష సమావేశంలో ఆయా పార్టీల నాయకులు చేసిన సూచనలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. పార్టీలకతీతంగా అభివృద్ధి కొనసాగుతుందని మరోమారు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కిష్టయ్య, నర్సింహులు, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి, బీఎస్పీ నాయకుడు శ్రీనివాసులు, సీపీఎం నాయకుడు రాజు, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, మున్సిపల్ శాఖ అధికారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి

తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్, జూలై 22 : రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ముంతాజ్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 43 శాతం రిజర్వేషన్ పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మాన్యానాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, మండల ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

విఠాయిపల్లిలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ వసంత

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు, జూలై 22 : నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం సోమవారం మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ.. పర్యావరణం కలుషితమవుతున్న నేటి కాలంలో మానవ మనుగడ కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ జూనియర్ సహాయకుడు సత్యనారాయణ, సిబ్బంది ఎల్లయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పానుగంటి పర్వతాలు

మొయినాబాద్, జూలై 22 : భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. నెల 26న నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగం కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ విధానాన్ని కల్పించి వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. వేలి ముద్ర విధానాన్ని రద్దు చేయాలని కోరారు. లేబర్ అడ్డాల వద్ద షెడ్లను ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. లేబర్ కార్డులను తక్షణమే ఇవ్వాలన్నారు. ఈ నెల 26న చేపట్టనున్న భవన నిర్మాణ కార్మికుల చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, మొయినాబాద్ మండల సీపీఐ కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

షాబాద్ పీహెచ్‌సీ డాక్టర్‌గా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాబాద్, జూలై 22 : షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ డాక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ ఇటీవల బదిలీపై నగరంలోని నిలోఫర్ దవాఖానకు వెళ్లారు. ఆయన స్థానంలో షాద్‌నగర్‌లో పనిచేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి షాబాద్‌కు బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్షలోపాల్గొన్న కడ్తాల్ మండల వడ్డెర సంఘం నాయకులు

కడ్తాల్, జూలై 22 : వడ్డెరలను బీసీ జాబితాలో నుంచి తొలగించి ఎస్టీ జాబితాలోకి చేర్చాలని వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు వరికుప్పల రాజు అన్నారు. వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలమల్లు శివరాత్రి ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో కడ్తాల్ మండలానికి చెందిన వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా వడ్డెరుల గురించి పట్టించుకోవడంలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వడ్డెరులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 16 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, వడ్డెరులకు కార్పొరేషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడిచిపోతున్నా వడ్డెరుల జీవితాలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరులు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో చాలా వెనుకబడి పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్, జూలై 23 : మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వివిధ సబ్జెక్టుల బోధనకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు అర్హత గల పురుష, స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సాంఘిక శాస్త్రం-స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, టెట్ (పేపర్-2లో సోషల్ మెథడాలజీ) ఉండాలని.. పీజీ, ఎంఈడీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆంగ్లం సబ్జెక్ట్-స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు డిగ్రీ, బీఈడీ, టెట్ (పేపర్-2లో ఇంగ్లిష్ మెథడాలజీ)తో పాటు పీజీ, ఏంఈడీ ఉన్న అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేలు గౌరవ వేతనం అందజేయడం జరుగుతుందని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 9553003777ను సంప్రదించాలని ఆయన కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పొందినవారు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లాలోని ఆయా మండలాల వ్యవసాయాధికారులు సోమవారం సూచించారు. 2024 జూన్ 28 వరకు కొత్త పాసు బుక్ పాసు పుస్తకాలు పొంది, 18 నుంచి 59 సంవత్సరాల్లోపు ఉన్న రైతులు రైతుబీమా పథకానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు పత్రం, పట్టాదారు పుస్తకం లేదా ఎమ్మార్వోతో డిజిటల్ సంతకం చేసిన డీఎస్ పేపర్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలతో ఆయా మండల కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆగస్టు 5లోగా అందజేయాలని వారు తెలిపారు. రైతు బీమాకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు వాటిలో ఏదైనా తప్పు లున్నట్లయితే ఏఈవోల వద్ద జూలై 30 వరకు సరిచేయించుకోవచ్చన్నారు.

– రంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్

స్మితాసబర్వాల్‌ను సస్పెండ్ చేయాలి

- దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్
- మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 22 : దివ్యాంగులను కించపరిచేలా ట్విట్టర్‌లో పోస్టు పెట్టిన ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమితి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. స్మితాసబర్వాల్‌పై దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలనే హక్కు ఆమెకు లేదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు బాలస్వామి, మల్లేశ్, లక్ష్మి, కొండల్‌రావు, బ్రహ్మచారి, దివ్యాంగులు ఉన్నారు.

బీజేపీ దళిత మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన తలారి శ్రీనివాస్‌కు సోమవారం నియామకపత్రం అందజేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి - మొయినాబాద్, జూలై 22

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

షాద్‌నగర్‌రూరల్, జూలై 22 : వర్షాకాలంలో వ్యాపించే వాధులపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని ఫరూఖ్‌నగర్ ఎంపీడీవో బన్సీలాల్ అధికారులకు సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగుకాలువలను శుభ్రం చేయడంతోపాటు ఎక్కడా నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జయంత్‌రెడ్డి, డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డాక్టర్ రాఘవేందర్, ఎంపీహెచ్‌ఈవో శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు, పీహెచ్‌ఎన్ పుష్పలీల, హెల్త్ అసిస్టెంట్ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి

కడ్తాల్, జూలై 22 : తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని మండల ఫొటోగ్రాఫర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన వాల్ పోస్టర్లను సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. మూడు రోజులపాటు నిర్వహించే ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో దేశంలోని ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు రబ్బానీ, కార్యదర్శి భీష్మాచారి, కోశాధికారులు పాల్గొన్నారు.

మానవళి మనుగడకు విధిగా మొక్కలను నాటాలి

కడ్తాల్‌లో మొక్కలు నాటుతున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూలై 22 : మానవళి మనుగడకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోశ్‌కుమార్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఏడో విడత కార్యక్రమాన్ని సోమవారం ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో స్పీకర్ సురమమా పాదితో ఆయన ప్రారంభించారు. సంతోశ్‌కుమార్ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి లక్ష్మీనర్సింహారెడ్డి మొక్కలను నాటారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయుడు రాధాకృష్ణారెడ్డి, నాయకులున్నారు.

నేడు మున్సిపల్ కమిషనర్ ఫోన్ ఇన్ కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, జూలై 22 : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ రవీంద్రసాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై ఫోన్‌లో సమాచారం అందించాలని ఆయన కోరారు. ఫోన్‌ఇన్ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలు తెలిపేందుకు, చర్చించేందుకు, పరిష్కారానికి సలహాలు, సూచనలిచ్చేందుకు 7386704867, 767582926లకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

చందనవెల్లిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు

ఘనంగా బోనాలు

షాబాద్, జూలై 22 : షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో ఉప్పలి మైసమ్మ, గడి మైసమ్మ బోనాల ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి గ్రామస్తులంతా గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు కొత్త బట్టలు ధరించి బోనాలు ఎత్తుకుని ర్యాలీగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు మంచిగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 22 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ముదిరాజ్‌సంఘం మండల అధ్యక్షుడు రవణమోని లింగం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీ ఏలోకి మార్చాలని కోరారు. దీనిపై ఈ నెల 24న తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించి తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించనున్నందున ఈ కార్యక్రమానికి ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్, జూలై 22 : షాబాద్ మండలంలోని రుద్రారం, నాగరగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగరగూడ నుంచి హైతాబాద్ వరకు 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు నిర్వహిస్తున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. ఈ విషయంపై ఇప్పటికే ఆయా గ్రామాల లైన్‌మెన్‌తో దండోరా వేయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు, సన్మానం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, గ్రామ పెద్దలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 22 : మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలను రాజకీయాలకు అతీతంగా అందరి సమన్వయంతో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్లిన, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో సోమవారం సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నది.

ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు, జూలై 22 : ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆకతాయిలను ఎస్ఐ వెంకటేశ్ హెచ్చరించారు. ఆమనగల్లు బస్టాండ్‌లో సాయంత్రం 5 గంటల సమయంలో స్కూల్ విద్యార్థులను కొంత మంది అకతాయిలు ఈవ్ టీజింగ్ చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఎస్ఐ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆకతాయులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి అనంతరం వారి తల్లితండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జల్సాల కోసమే చోరీలు..!

పెద్దఅంబర్‌పేట, జూలై 22 : జల్సాల కోసం చోరీలకు పాల్పడిన ఇద్దరు పోలీసులకు చిక్కారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన దొంగలను సీసీ పుటేజీల సాయంతో పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. సీఐ అంజిరెడ్డి కథనం ప్రకారం.. తారామతిపేటకు చెందిన రామాచారి, జయశ్రీ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 15న మనుమడిని చూపించేందుకు నగరంలోని హాస్పిటల్‌కు వెళ్లారు. మరుసటి రోజు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి దొంగలు బంగారం, వెండి వస్తువులు ఎత్తుకెళ్లినట్టు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరా పుటేజీల సాయంతో వరికుప్పల వెంకటేశ్, బత్తుల గోపి చోరీలకు పాల్పడినట్టు గుర్తించి, నిఘా పెట్టి ఎల్బీనగర్‌లోని సాగర్ రింగ్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. నిందితులను విచారించగా.. చోరీ చేసినట్టు అంగీకరించారని సీఐ తెలిపారు. చోరీ చేసిన ఆభరణాల్లో కొన్నింటిని విక్రయించి, వచ్చిన డబ్బును జల్సాలకు వాడుకున్నట్టు ఒప్పుకొన్నారని చెప్పారు. నిందితుల నుంచి పలు వెండి ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని సోమవారం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి అంగన్‌వాడీ విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ తదితరులు – ఆదిబట్ల, జూలై 22

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తెలుపుతూ.. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ వార్డు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె, రక్షణ పరికరాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ – తుర్కయాంజాల్, జూలై 22

షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డు వివేకానందకాలనీలో పోచమ్మతల్లి దేవాలయ నిర్వాహకులకు వెండి బొట్టు, కళ్లు, ముక్కుపుడక అందజేస్తున్న మలగారి సత్యనారాయణ – షాద్‌నగర్‌టౌన్, జూలై 22


విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ కరుణాకర్‌కు సోమవారం వినతి పత్రం అందజేస్తున్న పెద్దఅంబర్‌పేట కౌన్సిలర్లు – పెద్దఅంబర్‌పేట, జూలై 22

రైతును రాజును చేయడమే ప్రభుత్వ ధ్యేయం

యాచారం, జూలై 22 : రైతును రాజును చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలోపు రుణమాఫీ చేసినందుకు మండల కేంద్రంలో కృతజ్ఞతా సభను సోమవారం తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ, మహాత్మాగాంధీ, కవయిత్రి మొల్ల, చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రైతులతో ర్యాలీ నిర్వహించి కొందరు రైతులను సన్మానించారు.